

రచయిత్రి ఆత్మహత్య
- జలంధర

(గత సంచిక తరువాయి)

ఇంటిల్లిపాదీ అవాక్కైపోయారు. పటిక బెల్లం కోసరం దేముడి గూడు దగ్గరకొచ్చిన విరించి వదినగారి కొంగు ముఖం చుట్టూ కప్పేసుకున్నాడు, భయంతో కుచించుకుపోతున్న అతణ్ణి దగ్గరగా తీసుకున్నది సుభద్ర.

నేరుగా వచ్చి పీట వేసుకుని, మూత పెట్టిన దిబ్బరొట్టె కంచంలో పెట్టుకుని, "వదినా! ఆవకాయ వెయ్యి" అని అరిచి అది తిని వెళ్ళిపోయాడు రఘు.

కానీ, ఆరోజు మొట్టమొదటిసారిగా ఆ ఇంట్లో విప్లవం తలెత్తిందనీ, దానికి పరోక్షంగా సుభద్ర బలైపోతుందనీ కల్లోకూడా అనుకోలేదు ఎవరూ.

ఆ రాత్రి దుర్గమ్మగారి పెడబొబ్బలు, శాపనార్థాలు, మామగారి మౌనం, ఆడబిడ్డల సతాయింపు - వీటన్నింటి నుంచీ పారిపోయి ఇంటి పెరట్లో కాస్త దూరంగా ఉన్న వేపచెట్టు దగ్గర మంచం వేసుకుని చీకట్లో కూర్చుంది సుభద్ర. ఆమె మనస్సు తడిసి ఉబ్బిన దేవదారు చెక్కలా బరువుగా ఉంది.

"ఇదుగో తీసుకో" ఆ చీకట్లో ఒక చెయ్యి ఆమె మంచం మీదికి వంగింది. భయపడి ఒక్క అరుపు అరవబోయింది. "నేనే వదినా! రఘుని. తీసుకో నీకు నేరేడు పళ్ళు ఇష్టమని తెచ్చాను" అవాక్కయి అలాగే చీకట్లో అప్పుడే రూపుదిద్దుకుంటున్న ఆ పదహారేళ్ళ పిల్లాడిని చూస్తూ కూర్చుండిపోయింది.

ఎక్కడినుంచో నెగడు చుట్టూ లంబాడీలు నృత్యం చేస్తున్న సంగీతం పసిబిడ్డ ఏడుపు కాపుల ఇంట్లోనుంచి పొగ చవితి చంద్రుడు.

"సుభద్రా" భర్త పొలంనుంచి వచ్చినట్లున్నాడు. గబుక్కున లేచి వెళ్ళి పోయింది లోపలికి. ఆ రాత్రి రఘు భోజనానికి రాలేదు.

"ఎక్కడ తిరుగుతున్నాడో వెధవ. రానీ" అత్తగారి అరుపులకు సమాధానం చెప్పలేదు సుభద్ర. అంతకుముందే తను చూశానంటే ఏం ముప్పోనని మాట్లాడకుండా వంటిల్లు కడిగి ముగ్గుపెట్టి బయటపడింది. పుట్టిన మూడు నెలలకే తల్లికి మళ్ళీ నెల తప్పితే, తలచెడిన మేనత్త తీసుకువెళ్ళింది రఘును పెంచడానికి.

కృష్ణాజిల్లా పల్లెటూర్లో మోదుగచెట్టునానుకుని ఉన్న పెంకుటింట్లో, సాయం సంధ్య వేళ దీపపు బుడ్డి వెలిగించుకుని, తాటాకు విసనకర్రతో విసురుకుంటూ తత్వాలు పాడే ఆ మేనత్త అంటే చాలా ఇష్టం రఘుకు. ఆమె మహా సౌందర్యవతి. ఆమె కంటి రెప్పలపైన తెలుపు, గులాబీరంగు కలిసిన వర్ణం, కాటుక పెట్టినట్లుండే కళ్ళు, గులాబీ పెదవులు, తీర్చిదిద్దినట్లుండే పలువరుస. మరొకసారి చూడాలనిపించే మనిషి ఆమె. పొట్టు పొయ్యిలో పంట కాలవనించి తెచ్చే నీళ్ళూ - ఈ కష్టాలేవీ ఆమెను కదిలించలేదు. ఎందుకో ఆమె భర్తపోయిన తరువాత మనోవర్తి నాలుగెకరాలతో విడిగా వేరే ఊర్లో ఉండేది. అంతేకానీ, అన్నగారింటిని ఆశ్రయించలేదు. ఆమె దగ్గర మతిభ్రష్టుడైన ఒక వ్యక్తి ఉండేవాడు. వయస్సులో ఆమె కన్నా ఇరవై ఏళ్ళు పెద్దయిన ఆయన ఆమె భర్తకు సవతి అన్నగారట. అత్తగారి

ఆస్తికి మిగిలిన ఏకైక వారసుడు అతని పిచ్చి ఏమంత ప్రమాదకరమైనది కాదు. ఎవర్నీ బాధించేది కాదు. పొలాల గట్టున తిరుగుతూ, సైకతలింగాలు చేస్తూ, స్నానాలు, జపాలు చేస్తూ తిరిగేవాడు. ఆమెకు, ఆయనకు ఏమిటి అనుబంధం అంటే సమాధానం లేదు. ఆయన లోకంలో ఆయనుంటే, ఆమె ఆయనను చూస్తూ కూర్చునేది.

"ఆ పిచ్చీ లేదు ఏం లేదు ఆ ముదనష్టపోడికి దాని రంకు మొగుడు. మాకు తెలియదా ఏమిటి? హాయిగా ఆ నాలుగెకరాల కొండ మీద ఐవేజుతో ఇక్కడ మా దగ్గరుండచ్చుగా. రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా అని" దుర్గమ్మగారు చేతులు రెండు గాలిలో తిప్పుతూ దుమ్మెత్తిపోసేది. ఆడబడుచు గుర్తుకువచ్చినప్పుడల్లా.

కొంచెం పెద్దవాడైన తరువాత రఘు, "అత్తయ్యా! ఆయన ఎవరూ?" అని అడిగితే ఆకాశం, కొండా కలిసేచోటు చూస్తూ నవ్వి ఊరుకునేది ఆవిడ. పసిబిడ్డగా ఉన్నప్పటినుంచీ రఘును ప్రాణంగా పెంచేది ఆవిడ.

వెచ్చటి ఆవిడ స్పర్శలో తత్వాలు వింటూ హాయిగా నిద్రపోయేవాడు రఘు. ఆమె మంచితనం, సౌందర్యం, స్వాతంత్ర్యం అతని వ్యక్తిత్వంపై చెరగని ముద్రవేశాయి.

ఎప్పుడైనా ఆవిడతో తల్లిగారి ఊరుకు వచ్చినా, తల్లి ఏదో ఒక రకంగా ఆవిడతో తగూవేసుకోడం చూసి చిరాకు పుట్టేదతనికి. కానీ, మేనత్త మాత్రం దుర్గమ్మగారిని చూసి మూర్ఖపు పసిబిడ్డమీద జాలిపడుతున్నట్లు నవ్వేది. ఆవిడ మరింత రెచ్చిపోయేది. తల్లిమీద అంతర్లీనంగా పరమ భయంకరమైన జుగుప్స పెరిగిపోయింది రఘుకు. కారణం ఇది అని చెప్పలేక పోయేవాడు. ఏ ఆడదీ తల్లిలా మాత్రం ఉండకూడదనిపించేదతనికి.

హాయిగా సాగిపోతున్న రఘుజీవితంలో అత్తయ్య పిచ్చిబావగారి మరణం చెరగని ముద్రవేసింది.

వాళ్ళు ముగ్గురు దాయమాడేవారు. ఆ పెద్దాయన పక్షాన పందాలు కూడా తానే వేసి న్యాయంగా ఆడేది అత్తయ్య. ఓడిన వాళ్ళు గెలిచినవాళ్ళకు కర్జూరపు పండు ఇచ్చుకోవాలి. అవి కూడా ఆమె అందరి తరపున తెచ్చిపెట్టేది కంచంలో.

ఆ రోజు ఆట చూస్తూ ఏదో పిచ్చి నవ్వు నవ్వుకుంటున్నాడు ఆయన.

"రంగా! నువ్వే గెలిచావు" అంటూ తలెత్తిందామె. ఆమె వంక సూటిగా చూస్తూ, సన్నగా నవ్వి, పక్కకు జారిపోయాడు ఆయన. గబుక్కున ఆ మనిషిని గుండెలకు హత్తుకున్నది అత్తయ్య.

ఆయన వెర్రిచూపు, ఆమె కన్నీరు, శేషించిపోతున్న వెన్నెల, మిణుకు మిణుకు మంటున్న దీపం, దూరంగా ఎక్కడో పెళ్ళి భజంత్రీలు, ఇంటినానుకునున్న సరస్సులో కప్పల జీవస్మరణ సమీక్ష. అవన్నీ ఎప్పుడూ మర్చిపోలేకపోయాడు రఘు. ఆ తరువాత అతను చూసిన అనేక కృత్రిమ జీవన సరళులలో విరామ సంగీతంలా ఆ రాత్రి ఎప్పుడూ గుర్తుకు వస్తుంది అతనికి.

ఆ తరువాత ఆమె ఇల్లు అమ్మేసి, పొలం రఘు పేర రాసి వెళ్ళిపోయింది ఎక్కడికో. కొంతమంది "కాశీకి" అన్నారు.

దాదాపు పదిహేనేళ్ళ ప్రాయంలో అపరిచితుడిలా తన సొంత ఇంటికి వచ్చాడు రఘు. కొన్ని మధ్య తరగతి జీవితాల్లో డబ్బు ఇచ్చే హోదా, అధికారం చిన్నప్పుడే తెలుస్తుంది. రఘుకు ఇపుడు అందరికన్నా నాలుగు ఎకరాలు అధికం ఉన్నది.

"వాడు నా పోలిక ఎప్పుడూ అదృష్టవంతుడే" ఆడబడుచు పొడగిట్టకపోయినా, ఆవిడ ఆస్థిమీద ఏ మాత్రం అసహ్యం లేని దుర్గమ్మగారు రఘురాగానే మిగతా బిడ్డలకన్నా అతనికి ప్రత్యేకత ఇచ్చి, గారాబం చేసి నెత్తికెక్కించుకుంది. ఆ ధోరణితో మరింత బెట్టుగా ఉండేవాడు రఘు. ఆ పిల్లాడంటే ఒక రకమైన భయం ఉండేది సుభద్రకు. చూపుల్లో ఎర్రజీర, మితభాషిత్వం ఆమెను మరీ భయపెట్టేవి.

ఒకనాడు సాయంత్రం దొడ్లో మల్లెపందిరి దగ్గర నీళ్ళు పోసుకుని, ఇంట్లో ఎవరూ లేరుకదా అని గభాల్న చీర చుట్టుకు వచ్చేసింది సుభద్ర. గుమ్మం దగ్గర నిలబడి ఉన్నాడు రఘు. ఆమె ప్రాణం చచ్చిపోయింది 'ఎప్పటినుంచి అక్కడున్నాడో అయినా తన భర్త

ఉన్నా, పాలేర్లు ఉన్నా, విరించి ఉన్నా రాని బెరుకు ఈ అబ్బాయిని చూస్తే కలుగుతుందేం' అనుకుని లోపలికి పారిపోయింది. ఒక రోజంతా తప్పించుకు తిరిగింది. మర్నాడు భర్తకు చెప్పి పాలారు చేత తడికల్తో స్నానాలదొడ్డి కట్టించుకున్నది.

"ఏనాడైనా ఎరుగుదుమా ఇట్లా మాట సాగించుకోవడం?" నవ్వుతూనే దెప్పింది ఆఖరి ఆడబడుచు జడవేయించుకుంటూ.

శుక్రవారమని తులసి దగ్గర దీపారాధన చేస్తోంది ఒంగి. వెలిగించిన దీపం ఆమె ముఖం మీద వింత కాంతి వలయం ఏర్పరుస్తోంది.

"వెంకన్నా! పెద్దమ్మగార్నడిగి కర్పూరం పట్టా మర్చిపోయి వచ్చాను" అంది సుభద్ర కరివేపాకు చెట్టు నీడలో ఉన్న మనిషిని చూడకుండానే.

మరునిమిషం మెల్లిగా, అరచేతిలో కర్పూరంతో నిలబడి సూటిగా చూస్తున్నాడు రఘు. ఉలిక్కిపడింది సుభద్ర. ఆ చూపుల వెనకాల అర్థాలు? ఆమె ఆలోచించడానికి కూడా భయపడింది. ఆమె పెద్ద చదువులు చదువుకున్నది కాదు. కాఫ్ లవ్, ఆడొలెసెంట్ ప్రేమలు ఆమెకు తెలియవు. కానీ, వాటన్నింటిని మించిన జ్ఞానం ఉన్నది. ఆమె స్త్రీ తరతరాల నారీ హృదయాల్లో స్పందించే రాగ రంజితత్వానికి ఎక్కడ తెరదించాలో ఆమెకెవరూ చెప్పక్కర్లేదు. అందుకే చటుక్కున లోపలికి వెళ్ళిపోయింది.

అతణ్ణి తప్పించుకుని తిరిగేది. పలకరిస్తే ముక్తసరిగా మాట్లాడేది. కానీ, దూరం ఆ వయసులో మరింత దగ్గరతనాన్ని పెంచుతుందని ఆమెకు తెలియదు.

"వరుసగా మూడురోజులుగా అన్నానికి రావడంలా! ఈ చచ్చినాడికేమైందో?" తిడుతూనే బాధపడుతోంది అత్తగారి మాతృహృదయం.

పరీక్ష కోసరం ఆ రాత్రి వడ్డనకు రోజులా తప్పించుకోకుండా తాను వచ్చింది. ఎక్కడో తిరిగి వచ్చి, కాళ్ళూ చేతులు కడుక్కుని లోపలికి పోబోతున్న అతన్ని చూస్తూ, "అన్నానికిరా రఘూ! నీకిష్టమని కందిపచ్చడి చేశాను," అన్నది.

సూటిగా చూసి, మాట్లాడకుండా కంచం దగ్గర కూర్చున్నాడు అతను అర్థమైపోయింది సుభద్రకు. తనెంత జాగ్రత్తగా ఉండాలో కూడా అర్థమైంది.

"రేపు శ్రావణ శుక్రవారం చెర్లో తామర పువ్వులు తెమ్మనండత్తయ్యా! పూజ చేసుకుందాం" చెప్పింది అత్తగారికి.

"ఆఁ! ఎవరు తెస్తారే పాలేరు పక్కూరు తిరనాళ్ళకు పోయాడు. చూద్దాంలే" అంది దుర్గమ్మ మజ్జిగ చేస్తూ.

మర్నాటి పొద్దునకల్లా తామరపూవులతో వచ్చాడు పాలేరు. బోలెడంత సంబరపడిపోయింది సుభద్ర. అమ్మవారే కరుణించింది అనిపించింది. లేకపోతే, వాడికి ఈ ఆలోచన వచ్చి తీసుకురావడమేమిటి?

పూజ, భోజనాలు అయి పాలేరుకు అన్నం పెడుతూంటే, "ఆ తామర పూలకోసరం పోయి రఘుబాబు ముళ్ళకంచ మీద పడ్డారమ్మా. బాగా గీసుకుపోయింది. మీకెవరికీ చెప్పవద్దన్నారు" అన్నవాడి మాటలకు అవాక్కైపోయింది సుభద్ర.

పనంతా అయిన తరువాత, ఇల్లంతా వెదికి కొంచెం దూది, టించరు పట్టుకెళ్ళింది.

వడ్ల కొట్లో తలమీద చెయ్యి పట్టుకుని పడుకున్నాడతను. జాలేసింది సుభద్రకు.

"ఇదుగో ఇక్కడ పెడుతున్నాను. మందు వేసుకో" అంది గుమ్మము దగ్గర నిలబడి.

చటుక్కున కళ్ళకు చెయ్యి అడ్డం తీశాడు. తలంటిపోసుకుని జారవిడిచిన జుట్టు, తాంబూలంతో పండిన ఎర్రటి పెదవులు, మామిడి చిరుగు కుంకుమ, మెళ్ళో చంద్రహారం, చేతికి ఆకుపచ్చగాజులు కలిసి అతని కళ్ళ మెరుపులో కనబడ్డ ప్రశంసలో ఏదో ప్రలోభం.

చటుక్కున వెనుదిరిగింది సుభద్ర. ఆమె గుండెల్లో ఏదో దడ, రక్తంలో ఏదో ఝరి.

"చిన్నమ్మగారు ఇయ్యాల చాలా బావున్నారు. కొత్తచీరేంటి?" పలకరించింది చాకలి రత్తి ఆ తర్వాత. ఆడదాన్లో నిద్రిస్తున్న సౌందర్యం మెరుపై అంబరమై, మహార్ణవమై ప్రజ్వరిల్లి తటిల్లతా సౌందర్య దీప్తిగా వెలగడానికి కేవలం కొత్తచీర సరిపోదని తెలియదు పాపం దానికి.

ఆ రోజునుంచీ జీవితంలో కొత్త మలుపులు ఎక్కువైనాయి సుభద్రకు. ఆమె పూజకు అడక్కుండానే పూవులు వచ్చేవి. ఆమె ఇంటిపని చేసుకుని నడుం వాల్చే సమయానికి తాటిముంజలు ఆమె గది గుమ్మం ముందు ఒలిచిపెట్టి ఉండేవి ప్లేట్లో. తోటలోని మల్లెపూవులు సాయంత్రానికల్లా అరిటాకులో ఆమెకు అందచెయ్యబడేవి. వీటన్నింటి వెనకాల ఉన్న అదృశ్య హృదయం ఆమెకు అర్థమయ్యేది కానీ, అదిచ్చే గర్వంకన్నా, రానున్న పరిణామాల భయం ఆమెకు ఎక్కువై పోయింది. భర్తలోని అమాయకత్వం, నిశ్చింతా ఆమె బాధ్యతను మరింత ఎక్కువ చేసేవి.

"నేను ఈ ఇంటి పెద్దకోడలిని. దుఃఖమైనా, సుఖమైనా, కష్టమైనా, నిష్ఠూరమైనా ఈ కుటుంబ సుఖశాంతులు, మిగతావారి నైతిక విలువలు నామీద ఆధారపడి ఉంటాయి 'అమ్మా! అన్నపూర్ణా! నాకు ఆత్మశక్తి ప్రసాదించు. ఏ ప్రలోభాలకూ లొంగకుండా నీలో కలిసిపోయే అనుభూతి నాకు ప్రసాదించు' అని వెండికుందుల్లో దీపాలు వెలిగించి, ఎర్రమందారాలతో దేవిని అలంకరించి ప్రార్థించేది సుభద్ర.

"ఏమిటి నీ పిండాకూడు చాదస్తం. ఎంతకీ తెమలదేం ఆ పూజ? ఛస్తున్నాం. పిల్లలు అన్నాలకని కడబట్టిపోతున్నారు" అని అరచింది అత్తగారు ఓ రోజు.

ఎక్కడినుంచి వచ్చాడో మరొకసారి. తగూపెట్టుకున్నాడు రఘు. సుభద్రకు తెలుసు. తనను ఎవరేమన్నా అతను ఊరుకోడని. కానీ ఎలా అతన్ని ఆపడం? ఆమె చిన్న బుర్రకు ఈ సమస్యకు పరిష్కారం తెలియలేదు ఇది మరొకరకం ఆడదాని సమస్య అయితే, పరిష్కారం ఎలా ఉండేదోకానీ, ఆ వ్యక్తి సుభద్ర అవడంవల్ల సమస్య.

రఘుకు పద్దెనిమిదేళ్ళు దాటాయి. యవ్వనం అతనిలో మరింత విప్లవాన్ని రేపుతోంది. ఎక్కడెక్కడి తగాదాల్లోనూ తలదూర్చేవాడు. ఏ పని చేసినా అతిగా చేసేవాడు. పొద్దున్నే చెర్లో దూకితే సాయంత్రందాకా ఈదేవాడు. పట్నానికి సినిమాలకు పోతే మూడాటలు చూసి కానీ వచ్చేవాడు కాదు. తగాదాలకు దిగితే, ఎదుటి మనిషికి స్పృహ తప్పేదాకా కొట్టేవాడు.

ఎన్ని విషయాలు విన్నా ఏమనేది కాదు సుభద్ర. ఆమె వినాలనీ, ఏదో అనాలనీ మరీచేసేవాడు.

"చిన్నబాబును కాస్త కేకలెయ్యండమ్మా! ఆ సుబ్బారాయుడిగారి కోడలితో ఏటిఒడ్డున కనబడ్డాడట. ఆవిడ చెయ్యి పట్టుకోవడం చూశారట ఎవరో. అసలే ఆ మనిషి నీతీ జాతీలేని మనిషి" కబురు అందించి చల్లపోసి వెళ్ళిపోయింది రంగి. స్థాణువులా నిలబడిపోయింది సుభద్ర. అత్తగారు శాపనార్థాలు ప్రారంభించింది. రఘును, అతణ్ణి పెంచిన అత్తయ్యను అందర్నీ తిట్టింది. సుబ్బారాయుడిగారి కోడల్ని, ఆవిడ వంశాన్ని గుంటలో పెట్టి లేవనెత్తింది.

ఆవిడ బాధలో అర్థముందనిపించింది సుభద్రకు. రఘు వస్తాడేమోనని భయపడుతుండగా రానేవచ్చాడతను. తల్లి తిట్లన్నీ విన్నాడు. కానీ, చాలా విచిత్రంగా నోరు మెదపలేదు. సుభద్రను ఒక్కచూపు చూసి లోపలికి వెళ్ళిపోయాడు. ఆ కళ్ళల్లో వెటకారానికి ఒళ్ళుమండిపోయింది సుభద్రకు. ఒళ్ళు మర్చిపోయేటంత కోపమొచ్చింది. నేరుగా అతనితోపాటు గదిలోకి వెళ్ళి నిలబడి, "ఏమిటి నీ ఉద్దేశం? ఆ మనిషి ఎట్లాంటిదో తెలుసా?" గట్టిగా అడిగింది.

ఒక్కసారి ఆమెవంక చూసి, గడ్డం మీద చెయ్యి పెట్టుకుని రాసుకుంటూ ఎటో చూస్తున్నాడు అతడు. వచ్చే నవ్వు అణుచుకుంటున్నాడు. అది అసలు భరించలేని విషయం. భగ్గుమంది సుభద్రకు.

"మాట్లాడవేం?" సన్నటి ఆమె గొంతులో చాలా పదునుంది.

"ఊఁ! అందరూ సుభద్రలుకారుగా. తప్పుకో వదినా స్నానానికి వెళ్ళాలి."

అంత మెత్తగా చెప్పి అవాక్కయి నిలబడ్డ ఆమెను తప్పించుకుని స్నానానికి వెళ్ళిపోయాడు.

ఇలా ఈ జీవన్నాటకం ముగిస్తే ఎలా ఉండేదో కానీ, సుభద్ర అంత అదృష్టవంతురాలేం కాదు.

"పూర్ణం బూరెలు మీ ముఖంలా ఉన్నాయి. ఏమిటివి?" మామగారు కేకలేస్తున్నారు. అవిచేసింది చిన్నాడబడుచు. ఆ విషయం తెలియదు పాపం ఆయనకు. విస్తట్లోనుంచి దూరంగా పెట్టాడు రఘు.

"సుభద్రే చేసిందే పాపం పాకం కుదిరివుండదు" చిన్నాడబడుచు చటుక్కున అన్నది.

అప్పటిదాకా విడిగ తీసిపెట్టినవి నెయ్యి వేయించుకుని తింటున్నాడు రఘు.

"ఏం వదిన పేరు చెప్పగానే ఎక్కుతున్నాయేం రఘూ?"

అవాక్కైపోయింది సుభద్ర. ఆవిడ మాటల్లో వెటకారం, మరేవో అర్థాలు.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments